# మూత్రపిండాల వ్యాధులు

"మూత్రపిండాలు పనిచేయకపోవడాన్ని గ్రహించకుండా ఉబ్బుకామెర్లు అంటూ కొందరు అర్థంలేని వైద్యాలు చేయించుకోవడంతో మూత్రపిండాలు శాశ్వతంగా దెబ్బతింటున్నాయి. ఈ వ్యాధి కలిగిన వెంటనే డాక్టరుని సంప్రదించి చికిత్స పొందితే కిడ్నీలు పాడవకుండా చేసుకోవచ్చు" అని ప్రముఖ ఫిజీషియన్ డా॥ మెహర్ ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డా॥మారు అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన "మూత్రపిండాల వ్యాధులు" అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మనం తీసుకున్న ఆహారం జీర్ణం అయిన తర్వాత విడుదలయ్యే అనేక రసాయనాలను, వ్యర్థ పదార్థాలను మూత్రపిండాలు మనం శరీరం నుండి బయటకు పంపించడమే కాకుండా మన శరీరంలోని నీటిని, లవణాలని కూడా క్రమబద్ధకరిస్తూ ఉంటాయన్నారు. రక్తపోటుని అదుపులో ఉంచేది కూడా మూత్రపిండాలేనని ఆయన అన్నారు. కిడ్నీలలో ఇన్‌ఫెక్షన్స్, రాళ్ళు చేరడం, కణుతులు, కిడ్నీలు పాడయిపోవడం సాధారణంగా కలిగే మూత్రపిండాల వ్యాధులు అన్నారు. పిల్లల్లో ముఖం ఉబ్బరం, మూత్రంలో రక్తం, బి.పి.పెరగడం కనబడినప్పుడు వెంటనే గుర్తించి చికిత్స చేయించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితినే ఎక్యూట్ నెఫ్రైటిస్ అంటారు. డొక్కల్లో విపరీతంగా నొప్పి వస్తున్నట్లైతే మూత్రపిండాలలో రాళ్ళు ఉన్నాయేమో పరీక్ష చేయించుకోవాలన్నారు. చిన్నరాళ్ళు మూత్రం ద్వారా బయటకు వచ్చేసినా పెద్ద రాళ్ళు అడ్డుపడి కిడ్నీలని పాడు చేస్తాయన్నారు. ఈ రాళ్ళను బాస్కెటింగ్ ద్వారా లేదా శస్త్ర చికిత్స ద్వారా తీసేయాలన్నారు. నేడు ఆధునిక చికిత్సలో ఆపరేషను అవసరం లేకుండా లితోట్రిప్సి పద్ధతి ద్వారా రాళ్ళను పిండి చేసి తీసివేయవచ్చని డా॥మెహర్ ప్రసాద్ అన్నారు. మూత్రపిండాలలో రాళ్ళు ఉన్నవాళ్ళు మంచినీళ్ళు ఎక్కువ త్రాగాలన్నారు. కిడ్నీలకు క్షయ, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్సే కాకుండా కేన్సరు కూడా రావచ్చన్నారు. మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోనట్లైతే మూత్రపిండాలు త్వరగా దెబ్బతింటాయన్నారు. ఎక్కువుగా వాంతులు, విరోచనాలు అయినవారు ద్రవ పదార్దాలు ఎక్కువుగా తీసుకోకపోతే కిడ్నీలు పాడవుతాయన్నారు. కిడ్నీలు బాగా పాడైనవారికి డయాలసిస్, కిడ్నీ మార్పిడి అవసరం అవుతాయన్నారు. నేడు ఆధునిక వైద్యం పురోగమించడంతో మూత్రపిండాలలో నొప్పి కలిగిన వెంటనే వైద్యం చేయించుకుంటే ప్రమాదం నుండి బయటపడవచ్చని డా॥మెహర్ ఎన్ ప్రసాద్ అన్నారు.